సాక్షి
నిజామాబాద్

మంగళవారం । 30 । జనవరి । 2024



కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి

బాల్కొండ మండల కేంద్రంలోని 1333 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది.

- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.7 /17.4

వాతావరణం

ఉదయం చలిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పదో తరగతి తత్కాల్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: పదోతరగతి తత్కాల్ పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు డీఈవో దుర్గా ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6 తేదీ వరకు తత్కాల్ ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ పరీక్షకు ఫీజు చెల్లించిన వారే.. సప్లిమెంటరీ పరీక్షలకు అర్హులన్నారు. గడువులోపు ఫీజును చెల్లించవచ్చని పేర్కొన్నారు.

గ్రామీణ యువ రైతులకు నైపుణ్య శిక్షణ

డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని యువ రైతులకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ పథక సంచాలకులు తిరుమల ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 మందిని ఎంపిక చేసి వివిధ పంటల్లో జీవ నియంత్రణ పద్ధతులపై మార్కెట్ కమిటీలోని ప్రయోగశాలలో వారం రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ రోజుల్లో ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యం కూడా ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. కావున జిల్లాలోని పదో తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ యువ రైతులు జిల్లా కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9440687698ను సంప్రదించాలని సూచించారు.

జిల్లా పరిషత్‌కు నిధులు కేటాయించాలి

- కలెక్టర్‌కు జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు వినతి



నిజామాబాద్ రూరల్: ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లా పరిషత్‌కు నిధులు కేటాయించాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీలు, మౌలిక వసతుల పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుందన్నారు.

నర్సింగ్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



నిజామాబాద్‌నాగారం: జిల్లా వ్యాప్తంగా నర్సింగ్ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హత సాధించిన 380 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను డీఎంహెచ్‌వో సుదర్శనం ఆధ్వర్యంలో పరిశీలించారు. సోమవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో నర్సింగ్ అభ్యర్థులకు సంబంధించి హాల్‌టికెట్లు పరిశీలించి ఐడీకార్డులను అందజేశారు. జిల్లాలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్లకు సంబంధించి నర్సింగ్ అభ్యర్థులు హాజరయ్యారు.

31న హైదరాబాద్‌కు..

నర్సింగ్ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులను హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియానికి తీసుకెళ్లనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. తదుపరి నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.

జిల్లాలో మరో నలుగురు సీఐల బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు కొనసాగుతున్నాయి. సోమవారం మరో నలుగురు సీఐలకు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. శనివారం 18 మంది సీఐలు బదిలీ కాగా అంతకుముందు ఒకరికి స్థానచలనం కలిగింది. ఇప్పటి వరకు జిల్లాలో 23 మంది సీఐలకు బదిలీలు జరగగా మరికొందరికి ట్రాన్స్‌ఫర్స్ జరుగుతాయని పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. సిద్దిపేట్‌లో పనిచేస్తున్న భిక్షపతిని ధర్పల్లి సీఐగా బదిలీ చేశారు. ధర్పల్లి సీఐగా బదిలీ అయిన సీఐ సురేందర్‌ను మళ్లీ సీసీఎస్‌కు బదిలీ చేశారు. సౌత్ సీఐగా ఉన్న వెంకటనారాయణను ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న సీఐ సురేశ్ సౌత్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.



బోధన్‌లోని షుగర్ ఫ్యాక్టరీ

సర్కారు తొలిఅడుగు

- ఎన్డీఎస్ఎల్ పున:ప్రారంభానికి కసరత్తు
- సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీ వేసిన ప్రభుత్వం
- రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- కార్మికులు, చెరుకు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



బోధన్ ఎన్డీఎస్ఎల్ ఎదుట కార్మికుల నిరసన(ఫైల్)

బోధన్: నిజాం షుగర్స్ పునఃప్రారంభానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మూతపడిన నిజాంషుగర్ ఫ్యాక్టరీల ప్రారంభానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య ఉన్నత శాఖ అధికారులతో కమిటీ వేసింది. ఈ విషయాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇటీవల నియోజకవర్గం పరిధిలోని హున్సా గ్రామ పర్యటనలో వెల్లడించారు. ఈ నెల 12న కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి క్షేత్రస్థాయిలో స్థితిగతులు పరిశీలించి రెండు నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని జీవోలో పేర్కొన్నారు. దీని కోసం డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్, నిజాంషుగర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించింది. మూతబడిన నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ క్రమంలో ఫ్యాక్టరీల పునఃప్రారంభానికి కమిటీ ఏర్పాటు చేసి తొలి అడుగు వేసిందని చెప్పవచ్చు. దీంతో ఫ్యాక్టరీ కార్మికులు, చెరుకు రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

కమిటీ సభ్యులు వీరే..

కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్‌గా రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి, పరిశ్రమల, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ (నిజాంషుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్) ఉన్నారు.

మూతపడి ఎనిమిదేళ్లు

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని 1938లో నిజాం కాలంలో నెలకొల్పారు. ఈ ఫ్యాక్టరీ దశాబ్దాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించింది. చెరుకు రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడింది. రాష్ట్రవ్యాప్తంగా షుగర్ ఫ్యాక్టరీల విస్తరణకు దోహదపడింది. 2002లో చంద్రబాబు హయాంలో బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఫ్యాక్టరీలను ప్రైవేట్‌పరం చేశారు. దీంతో ఎన్‌డీఎస్ఎల్(నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్)గా మారింది. ఈ మూడు ఫ్యాక్టరీలను 2015 డిసెంబర్ 23న లేఆఫ్ ప్రకటించి మూసివేశారు.

పసుపుపై కేంద్రానికి విజన్ ఉంది

- పంటకు పూర్వవైభవం తీసుకొస్తాం
- రైతులకు మంచి ధర వచ్చేలా కృషి చేద్దాం
- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- మార్కెట్‌యార్డులో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో సమావేశం

సుభాష్‌నగర్: పసుపు పంటపై కేంద్ర ప్రభుత్వం విజన్‌తో ఉందని, అందుకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తోందని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎగుమతులు రూ. 6,400 కోట్ల టర్నోవర్ అధిగమించాలని ప్రధాని మోదీ లక్ష్యంగా పెట్టారని పేర్కొన్నారు. సోమవారం నగరంలోని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో గల ది మర్చంట్ అసోసియేషన్ భవన్‌లో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా అన్నదాతలకు సహకరిద్దాం.. మంచి ధర వచ్చేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అంతకుముందు మార్కెట్‌యార్డులో పసుపు పంటను పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పసుపునకు మూడేళ్లుగా మంచి ధర వస్తుందని, ఈసారి కూడా వస్తుందని ఆశిస్తున్నామన్నారు. రైతులు తేమశాతం 12లోపు ఉండేలా బాగా ఎండబెట్టాలని, అప్పుడే మంచి ధర వస్తుందన్నారు. తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. పసుపు బోర్డు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. పసుపు పంటకు రసాయనాల వినియోగం పెరగడంతో ఎగుమతులు తగ్గుతున్నాయని గుర్తుచేశారు. వ్యాపారులు పసుపు శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేసుకుని ఎగుమతిదారులుగా మారాలని సూచించారు. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు పర్సంటేజీలు, పార్టనర్ షిప్స్ అడిగారని, ఈ ప్రభుత్వం అలా ఉండబోదని భావిస్తున్నానన్నారు. ఎంపీ, ఆర్మూర్, అర్బన్ ఎమ్మెల్యేలు నయా పైసా అడగబోరని తెలిపారు. పసుపు రవాణా, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నిధులు తరలిపోకుండా చూడాలి

నిజామాబాద్ మార్కెట్ యార్డు నిధులు గత పాలకులు సిద్దిపేట్, గజ్వేల్, ఒంటిమామిడి, ఇతర మార్కెట్లకు తరలించారని ఎంపీ అర్వింద్ విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

35 ఏళ్ల కల పసుపుబోర్డు..

జగిత్యాల్, నిజామాబాద్, నిర్మల్, కరీంనగర్, తదితర ప్రాంత పసుపు రైతుల 35 ఏళ్ల కల పసుపు బోర్డును ప్రధాని మోదీ నెరవేర్చారని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని వ్యాపారస్తులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు లాభిషెట్టి శ్రీనివాస్, సెక్రెటరీ వెంకటేశం, గ్రేడ్–2 సెక్రెటరీ విజయ్ కిషోర్, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్ తదితరులు

ఎస్సైల బదిలీలకు రంగం సిద్ధం!

- కసరత్తు చేస్తున్న పోలీసు అధికారులు
- సిఫార్సు లేఖలతో వచ్చిన ఎస్సైలలో గుబులు



ఖలీల్‌వాడి: జిల్లాలో ఎస్సైలకు బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఎస్సైల పనితీరు ఆధారంగా బదిలీలు జరుగుతాయనే ప్రచారం జరుగుతోంది. శాసనసభ ఎన్నికలకు ముందు రెండుమూడేళ్లు ఉన్న ఎస్సైల బదిలీలు జరిగాయి. దీంతో జిల్లాకు జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఎస్సైలు వచ్చారు. అంతేకాకుండా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన ఎస్సైలకు స్థానం చలనం కల్పించారు. దీంతో ఎన్నికల్లో ఎస్సైల పనితీరు, పోలీస్‌స్టేషన్‌లో కేసుల పురోగతి, గతంలో బీఆర్ఎస్‌కు సపోర్టు చేసిన ఎస్సైల జాబితాను పోలీసు అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

నాలుగు రోజుల్లోపు జాబితా..

ఎస్సైలకు జాబితాకు సంబంధించిన కసరత్తు చివరి దశకు చేరుకుంది. దీంతో నాలుగు రోజుల్లో జాబితా బయటకు వస్తుందనే చర్చ పోలీస్‌వర్గాల్లో జరుగుతోంది. ఎవరు ఉంటారు, ఎవరు బదిలీ అవుతారనేది చర్చనీయాంశంగా మారింది. కొంత మంది ఎస్సైలు బదిలీలు చేయించుకోవడానికి సెలవులపై వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. బదిలీ జాబితాలో ఎవరి పేర్లు ఉంటాయని ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో రెండు విడతల్లో 23 మంది సీఐలకు స్థానం చలనం కలిగింది. వీరిలో కొంత మందిపై ఆరోపణలు రావడం గమనార్హం. సీఐల బదిలీల్లో ఎక్కువ మంది సిఫార్సు లేఖలతో వచ్చిన వారే ఉన్నట్లు శాఖలో ప్రచారంలో ఉంది.

అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని..

కమిషనరేట్‌కు సీపీగా కల్మేశ్వర్ బదిలీపై రాకముందే జిల్లాలో ఎస్సైల బదిలీలు జరిగాయి. దీంతో ఇక్కడ పనిచేయడానికి ఎస్సైలు తమకు అనుకూలంగా ఉండే బీఆర్ఎస్ నేతలతో సిఫార్సు చేయించుకున్నారు. ఇలా వచ్చిన ఎస్సైలు ఎన్నికల సమయంలో ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. కొందరు ఎస్సైలపై ఎమ్మెల్యే అభ్యర్థులు ఫిర్యాదులు చేసిన ఘటనలున్నాయి. దీంతో ఎన్నికల వేళ అభ్యర్థులు వ్యవహరించిన తీరు ఆధారంగా ఎస్సైల బదిలీలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. అంతేకాకుండా స్టేషన్‌లో కేసుల పురోగతి, గంజాయి వంటి మత్తుపదార్థాలకు సంబంధించిన కేసుల విచారణ తదితర అంశాలను బదిలీల్లో పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

పైరవీలకు తావు లేకుండా..

ఎస్సైల బదిలీల్లో ఎలాంటి పైరవీలకు తావులేకుండా పోలీసు అధికారులు జాబితాకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగా సిఫార్సు లేఖలు పని చేయకపోవడంతో అనుకూలమైన పోలీస్‌స్టేషన్లకు వెళ్లడానికి ఎస్సైలు మార్గాలను అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఈ మార్గాల్లో అనుకూలమైన పోస్టు వస్తుందా లేదా అనే సందేహాలు ఎస్సైలలో వ్యక్తమవుతున్నట్లు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మమ అనిపించారు..

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లు
- హై డోస్ మందులు ఇస్తూ ప్రాణాలతో చెలగాటం
- రెండు క్లినిక్‌ల సీజ్‌తో సరిపెట్టిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



నగరంలోని అర్సపల్లిలో ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు(ఫైల్)

నిజామాబాద్‌నాగారం: ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాల్సిన ఆర్ఎంపీలు, పీఎంపీలు హై డోస్ ఇంజెక్షన్లు, యాంటిబయోటిక్స్ మందులు ఇస్తూ రోగుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఒక వేళ రోగి ఆరోగ్య పరిస్థితి విషమిస్తే జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ పెద్ద ఎత్తున కమీషన్‌లు దండుకుంటున్నారు. ఆ భారం రోగుల పైనే పడుతోంది. ఫలితంగా ఆస్పత్రులకు వెళ్లే రోగులు రూ. లక్షల్లో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. కాగా జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో కలిపి జిల్లాలో సుమారు 3 వేల వరకు ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లు ఉన్నాయి.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేసి..

జిల్లాలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ నగరంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఏడాది లేదంటే రెండు, మూడు సంవత్సరాలు పని చేసి ఆర్ఎంపీ,పీఎంపీలుగా అవతారమెత్తుతున్నారు. సూదులు ఇవ్వడం, చిన్న చిన్న రోగాలకు ఏ మందులు ఇవ్వాలో టాబ్లెట్‌ల, ఇంజెక్షన్‌ల పేర్లు తెలుసుకొని క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వారి బ్యాగులోనే గ్లూకోస్, ఇంజెక్షన్‌లు, యాంటిబయోటిక్స్ మందులు వెంట పెట్టుకుంటారు. ఎవరికైనా జ్వరం వచ్చిందని తెలిస్తే చాలు పోటీపడి ఇళ్లకు వెళ్తున్నారు. ఇంజెక్షన్‌లు, గ్లూకోస్ పెట్టి అధిక డోస్ ఉన్న మందులు ఇస్తూ, రూ. 500 నుంచి రూ. 1000 వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. డోస్ ఎక్కువగా ఇవ్వడంతో అప్పటికప్పుడు ఉపశమనం లభించినా.. భవిష్యత్తులో వచ్చే పెద్ద రోగాలపై అవగాహనలేక రోగులు ప్రాణాలను పణంగా పెట్టి ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు.

రెండింటితో సరి..

ఆర్ఎంపీ, పీఎంపీల తీరు గమనించిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యల కోసం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఇంజెక్షన్‌లు, యాంటిబయోటిక్స్ మందులు ఇస్తున్నారని నగరంలోని అర్సపల్లి, కల్లెడ గ్రామాల్లో రెండు క్లినిక్‌లు సీజ్ చేశారు. మూడు రోజుల తనిఖీలలో రెండు, మూడు క్లినిక్‌లు సీజ్ చేసి మమ అపించేశారని శాఖలోని ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

అనుమానాలెన్నో..

రెండు క్లినిక్‌ల సీజ్ అనంతరం ఆర్ఎంపీ, పీఎంపీల సంఘాలకు చెందిన ఇద్దరు, ముగ్గురు నాయకులతో జిల్లా వైద్యాధికారి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.అయితే ఎలాంటి మార్పు రాకపోవడంతో వైద్యవర్గాల్లోనే అనుమానాలు మొదలయ్యాయి.

“ మార్పు రావాలని చెప్పాం

ఆర్ఎంపీ, పీఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి. ఇంజెక్షన్‌లు, మందులు ఇవ్వకూడదని యూనియన్ నాయకులను పిలిపించి చెప్పాము. మార్పు రావాలన్నాం. అయినా మారకుంటే మేమేం చేయలేం. మా చేతుల్లో ఏమీ లేదు.

– డాక్టర్ సుదర్శనం, డీఎంహెచ్‌వో

లహరి బస్సులను సద్వినియోగం చేసుకోవాలి



బోధన్ బస్టాండ్‌లో లహరి బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): లహరి బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్ ఆర్టీసీ డిపో పరిధిలో సోమవారం ఈ బస్సులకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం బస్సులో ఎక్కి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్డు రవాణా సంస్థను నిర్వీర్యం చేసిందని, అందుకే బస్సుల కొరత ఏర్పడిందన్నారు. దీంతో కొత్తగా 2వేల బస్సులను తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి, డీఎం శ్రీనివాస్, డీఆర్ఎంలు సరస్వతి, శంకర్, ఆర్డీవో రాజాగౌడ్, పట్టణాధ్యక్షుడు పాషా మోయినుద్దీన్, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కౌన్సిలర్ శరత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్లయ్య, నాయకులు తాహెర్‌బిన్ హుందాన్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యం



మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: పోలీసులు ఫిట్‌నెస్‌తో ఉంటేనే విధులు సక్రమంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని సీపీ కల్మేశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బందికి నిర్వహించిన వార్షిక మొబిలైజేషన్–2024 శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 10 వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం స్పోర్ట్స్ నిర్వహిస్తారని, సిబ్బంది ఎల్లప్పుడూ ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండాలని.. అప్పుడే చక్కగా విధులు నిర్వహిస్తారని చెప్పారు. సిబ్బంది తమ ఆరోగ్యం బాగుండడానికి పౌష్టికాహారం తీసుకోవాలని, అంతేకాకుండా పాజిటివ్‌గా ఆలోచించాల్సి ఉంటుందన్నారు. ఎప్పుడూ సంతోషంగా ఉండాలని, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. శిక్షణను సిబ్బంది చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(ఏఆర్) గిరిరాజు, ప్రొబెషనరీ ఐపీఎస్ బి.చైతన్య రెడ్డి, ఏసీపీ అరుణ్ కుమార్, రిజర్వు సీఐ శ్రీపాల్, శ్రీనివాస్, తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి సజీవ దహనం

- పాత కక్షలతో మంటల్లో తోసివేత
- నెట్టేసిన వ్యక్తినే పట్టుకున్న బాధితుడు
- మృత్యువాత పడ్డ తోసిన వ్యక్తి
- బాధితుడికి తీవ్రగాయాలు

ఖలీల్‌వాడి: పాత కక్షలతో జరిగిన గొడవలో ఒకరు సజీవ దహనం కాగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని ఖిల్లా రోడ్డులోని ఓ పాడుబడిన భవనంలో ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. హష్మి కాలనీకి చెందిన షేక్ ముఖీత్(24), షేక్ హైమద్‌కు గొడవలున్నాయి. సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వీరిద్దరితో పాటు మరో ఇద్దరు పాడుబడిన భవనంలో మంట వేసుకుని మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో షేక్ ముఖీత్, షేక్ హైమద్‌కు మాటామాట పెరిగింది. హైమద్‌ను ముఖీత్ మంటల్లోకి తోసేశాడు. మంటలు అంటుకున్న హైమద్ వెంటనే ముఖీత్‌ను పట్టుకున్నాడు. ఈ మంటల్లో ముఖీత్ అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. హైమద్ తీవ్రంగా గాయపడ్డాడు. భవనం నుంచి అరుపులు వినిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన అహ్మద్‌ను జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. సీపీ కల్మేశ్వర్, డీసీపీ జయరాం, ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ నరహరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. షేక్‌అహ్మద్ భార్య షేక్ సనా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పాడుబడిన భవనం చుట్టు పక్కల గల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ జయరాం, ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, సీఐ నరహరి

క్లుప్తంగా

బోధన్‌లో కత్తిపోట్ల కలకలం

బోధన్‌టౌన్‌: పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీలో సోమవారం రాత్రి ఇద్దరి యువకుల మధ్య జరిగిన కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. సీఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆచన్‌పల్లి కాలనీ చెందిన షోయేబ్‌, వాసేలు ఇద్దరు మిత్రులు. షోయేబ్‌ తమ్ముడు సోహేల్‌, వాసే కసిన్‌ బ్రదర్స్‌ తన్వీర్‌, ఇల్యాస్‌ ఓ కాలనీలో కూర్చొని చిట్‌చాట్‌ చేస్తున్నారు. ఈ క్రమంలో షోయేబ్‌, వాసేల మధ్య చిన్న పాటి గొడవ జరిగింది. దీంతో వాసే కజిన్‌ బ్రదర్‌ ఇల్యాస్‌ కత్తితో షోయేబ్‌పై దాడికి దిగగా అక్కడే ఉన్న సోహేల్‌ అడ్డుగా రావడంతో కడుపులో తీవ్రగాయమైంది. ఇల్యాస్‌ కత్తితో మరోసారి దాడికి దిగగా ఈ సారి కజిన్‌ బ్రదర్‌ తన్వీర్‌కు కడుపులో గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కత్తిపోట్లకు గురైన ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు జిల్లా క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: జిల్లా జూనియర్‌ సాఫ్ట్‌ బాల్‌ బాల బాలికల జట్ల ఎంపికను మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్‌ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్‌ తెలిపారు. బాలుర ఎంపిక ఆర్మూర్‌, బాలికల ఎంపిక సుద్దపల్లిలో ఉంటుందన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

పకడ్బందీగా ప్రాక్టికల్‌ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలను ఫిబ్రవరి 1 నుంచి పకడ్బందీగా చేపట్టనున్నట్లు జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రఘురాజ్‌ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ బాలుర(ఖిల్లా) కళాశాలలో ప్రభుత్వ, అన్ని రెసిడెన్షియల్‌ కళాశాలల, ప్రైవేటు, జూనియర్‌ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మొత్తం జనరల్‌ విద్యార్థులకు 55 పరీక్షా కేంద్రాల్లో, ఒకేషనల్‌ విద్యార్థులకు 20 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్‌ పరీక్షలు నిర్వహించేందుకు ప్రయోగశాలలను సిద్ధం చేసినట్లు తెలిపారు. మూడు విడతలుగా పరీక్షలను ఫిబ్రవరి ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఉంటాయన్నారు. జనరల్‌ విద్యార్థులు మొత్తం 17,950 మంది, ఒకేషనల్‌ మొదటి సంవత్సరం 2,397 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 1,991 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్‌, రజీయొద్దీన్‌ అస్లాం, దేవరాం, ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు నర్సయ్య, బాలుర కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి

- సర్వే నంబరు 1333లో ఉన్న భూమిపై కబ్జాదారుల కన్ను
- ఆ మూడెకరాల భూమి ఏమైనట్టు..?
- భూ బకాసురులకు అండగా నిలుస్తున్న అధికారులు!



ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న స్థలం

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ మండలంలోని సర్వే నంబర్‌ 1333లో ఉన్న అత్యధిక ప్రభుత్వ భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంటోంది. దీనిని పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు భూ బకాసురులకు అండగా నిలవడంతో ఇక వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. మండల కేంద్రంలోని సర్వే నంబర్‌ 1333లో 224.19 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. దీని నుంచి గత ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్డు, విద్యా సంస్థలకు కలిపి 69.29 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులోని మూడు ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్టీఆర్‌ కాలనీ, విద్యాసంస్థల పేరుతో కేటాయించిన ఈ భూముల్లోనే కబ్జాదారులు ప్లాట్లుగా మలిచి ఆక్రమణ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆ సర్వే నంబరులోని మరి కొంత భూమిని ప్లాట్లుగా మార్చి, గత తహసీల్దార్‌ సంతకాల ఫోర్జరీతో పాటు పట్టాలు సృష్టించి విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం. ఇదంతా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనేది బహిరంగ రహస్యం. పలుమార్లు జీపీ నుంచి 1333 సర్వే నంబరులో అక్రమంగా ఏర్పాటు చేసిన ప్లాట్ల హద్దు రాళ్లను తొలిగించారు. కానీ కొందరు భూ కబ్జాదారులు అధికారులు అండతో హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సర్వేనంబరు భూమిలో కొండలు, గుట్టలు సైతం ఉన్నాయి. ఇందులోని మొరం అక్రమంగా తవ్వకాలు చేపడుతుండడంతో గుట్టలు సైతం గుల్లలు అవుతున్నాయి. సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల స్థలాల కేటాయింపులో ఉన్న భూమిని సైతం కబ్జాదారులు ప్లాట్లుగా మలుచుకుంటున్నారు. తహసీల్‌ కార్యాలయంలో పని చేసే ఓ వ్యక్తి తహసీల్దార్‌ సంతకాన్ని ఫోర్జరీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కబ్జా కోరల్లో చిక్కుకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కబ్జాలో మూడెకరాలు..!

సర్వే నంబరు 1333లోని కొండలు, ప్రభుత్వ స్థలాలు, జాతీయ రహదారి 44 బైపాస్‌ కోసం గత ప్రభుత్వం కేటాయించిన భూమిని రియాల్టర్లు అదును చూసుకొని దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్డు, విద్యాసంస్థలకు కలిపి 69.29 ఎకరాల భూమిని గత ప్రభుత్వం కేటాయించింది. కబ్జాకు గురైన మూడెకరాల స్థలం సుమారు రూ. మూడు కోట్లకు పైమాటే అని స్థానికులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబరు పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



సర్వేనంబరు 1333లో భూమి కబ్జాకు గురవుతుందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరాం. ఇప్పటి వరకు చేపట్టలేదు. మూడు ఎకరాల వరకు భూమికబ్జాకు గురైంది.

– సయ్యద్‌ రియాజ్‌, స్థానికుడు

భూమిని ఆక్రమిస్తే చర్యలు

మండలంలోని సర్వే నంబరు 1333లో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తు ప్లాట్లుగా మార్చుతున్నట్లు మా దష్టికి రాలేదు. ఓ వ్యక్తి గుట్టను తవ్వి భూమిని కబ్జా చేస్తున్నట్లు దృష్టికి రావడంతో పనులు అడ్డుకొని నిలిపివేశాం. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్‌, తహసీల్దార్‌, బాల్కొండ

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 61 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్‌: ప్రజా సమస్యల కోసం ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని నిజామాబాద్‌ కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 61 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ మకరందు, జెడ్పీ సీఈవో గోవింద్‌, డీఆర్డీఓ చందర్‌, ఏసీపీ కిరణ్‌ కుమార్‌ స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం ఏర్పాటుచేయాలి

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నిజామాబాద్‌ సొసైటీని రిజిస్ట్రేషన్‌ చేసేందుకు అవసరమైన సంతకాల సేకరణ కోసం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని సంఘం చీఫ్‌ ప్రమోటర్‌ కస్ప శ్రీనివాస్‌ కోరారు. ఈమేరకు ప్రజావాణిలో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, మత్స్యశాఖ ఏడీ రాజనర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయకుండా వివిధ గ్రామాల అధ్యక్షుల సంతకాలు వేర్వేరుగా తీసుకోవడంతో అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. ఈవిషయమై ప్రమోటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రమోటర్స్‌ ఎర్రం ఆశన్న, సురకత్తుల పెద్దన్న, భాస్కర్‌, సురేఖ, శ్రీనివాస్‌, పల్లికొండ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ఆపాలి

భీంగల్‌ మండలంలోని బెజ్జోర శివారులో పేదల కోసం గ్రామ కర్షాలు విరాళంగా ఇచ్చారని, ఆ భూమిని కొందరు కబ్జాలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు కలెక్టరేట్‌ ప్రధాన గేట్‌ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని పేదల ఇంటి నిర్మాణం కోసం 15 ఎకరాల 11 గుంటల భూమిని విరాళంగా ఇచ్చారని కొందరు ఆ స్థలాన్ని కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకుంటున్నారని, వెంటనే ఆ స్థలాన్ని పేదలకు అప్పగించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

వైస్‌ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు పైకెత్తిన ఎంపీటీసీలు

డిచ్‌పల్లి: మండల వైస్‌ ఎంపీపీ కులాచారి శ్యాంరావుపై ఎంపీటీసీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో రాజేంద్రకుమార్‌ ఆధ్వర్యంలో అవిశ్వాస బలపరీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. మొత్తం 17 మంది ఎంపీటీసీలకు 13 మంది సమావేశానికి హాజరయ్యారు. కోరం ఉండటంతో ఆర్డీవో అవిశ్వాస బలపరీక్ష నిర్వహించారు. వైస్‌ ఎంపీపీ శ్యాంరావుకు వ్యతిరేకంగా అవిశ్వాసానికి అనుకూలంగా 13 మంది ఎంపీటీసీలు చేతులు పైకెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. ఈ నెల 8న 12 మంది ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ గద్దె భూమన్న, వైస్‌ ఎంపీపీ కులాచారి శ్యాంరావులపై వేర్వేరుగా అవిశ్వాస తీర్మాణం లేఖలు అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ, 11.30 గంటలకు వైస్‌ఎంపీపీపై అవిశ్వాస సమావేశాలకు నిర్ణయిస్తూ సభ్యులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఎంపీపీ భూమన్న హైకోర్టు ద్వారా స్టే ఆర్డర్‌ తీసుకురావడంతో ఎంపీపీపై ఉదయం 10.30 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేసినట్లు చెప్పారు. వైస్‌ ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గినట్లు తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎంపీపీపై అవిశ్వాస సమావేశం తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీఎస్‌ గోపిబాబు, ఎంపీటీసీలు చిన్నోల్ల నర్సయ్య, దండుగుల సాయిలు, ఉగ్గెర కృష్ణవేణి, పులి నర్సింగ్‌రావు, చాకటి రాజమణి, కుర్రి సవిత, దుంపాల సౌమ్య, గండోల్ల సుప్రియ, బాలగంగాధర్‌, పోతర్ల సుజాత, రాథోడ్‌ బిక్యా, సాంపల్లి గోదావరి, అప్పాల మంజుల తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

డిచ్‌పల్లి వైస్‌ ఎంపీపీ శ్యాంరావుపై బలపరీక్ష సందర్భంగా ఆర్డీవో వినతి మేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌ ఆధ్వర్యంలో ఎస్సై మహేశ్‌ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. అవిశ్వాస సమావేశం ముగిసే వరకు కార్యాలయం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు.

పకడ్బందీగా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌

సుభాష్‌నగర్‌: ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారికి నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ నులి పురుగులతో పిల్లల్లో ఎదుగుదల లోపించడం, మంద బుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారని పేర్కొన్నారు. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం ప్రతియేటా రెండుసార్లు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు. ఇందులోభాగంగా ఫిబ్రవరి 12న జిల్లావ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి అల్బెండజోల్‌ మాత్రలు పంపిణీ జరిగేలా పకడ్బందీగా పర్యవేక్షించాలని తెలిపారు. ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి ఫిబ్రవరి 19న అందజేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్‌ మకరందు, జెడ్పీ సీఈవో గోవింద్‌, డీఆర్డీవో చందర్‌, డీఎంహెచ్‌వో సుదర్శనం, జిల్లా ఇమ్యూనైజేషన్‌ అధికారి అశోక్‌, డీఈవో దుర్గాప్రసాద్‌ పాల్గొన్నారు.

కత్తితో యువకుడి వీరంగం



ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న రాయల్‌–3 చికెన్‌ సెంటర్‌లో ఓ యువకుడు ఆదివారం రాత్రి కత్తితో వీరంగం చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌ కుమార్‌ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. చికెన్‌ సెంటర్‌ నిర్వాహకుడు మొయిజ్‌ తన అవసర నిమిత్తం సంతోష్‌ అనే వ్యక్తి వద్ద రూ. లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఇందులో రూ. 48 నగదు చెల్లించగా, మిగతా నగదు కోసం ఆదివారం రాత్రి చికెన్‌ సెంటర్‌కు వచ్చి డబ్బుల కోసం హంగామా చేశాడు. మొయిజ్‌ లేకపోవటంతో అందులో పనిచేసే షేక్‌ ఆసిఫ్‌తో గొడవపడ్డాడు. అక్కడే ఉన్న కోడి కోసే కత్తితో కౌంటర్‌ను ధ్వంసం చేశాడు. మొయిజ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లాటరీ పేరుతో మోసం

- 15 గ్రాముల బంగారం చోరీ



బాధితురాలు చైతన్య

డిచ్‌పల్లి: మీకు లాటరీ తగిలింది.. స్కూటీ, ఫ్రిడ్జ్‌, బంగారం వస్తువుల్లో ఏదో ఒకటి వస్తుందంటు మాయ మాటలు చెప్పి ఓ యువతిని గుర్తు తెలియని దుండగుడు మోసగించి 15 గ్రాముల బంగారాన్ని చోరీ చేశాడు. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో సోమవారం జరిగిన ఘటన కలకలం సృష్టించింది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని చైతన్యనగర్‌ కాలనీకి చెందిన ఓటకర్‌ చైతన్య ఇంట్లో ఉండగా ఆమె వద్దకు గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు. మీకు లాటరీ తగిలిందని స్కూటీ, ఫ్రిడ్జ్‌, బంగారం వస్తువుల్లో ఏదో ఒకటి వస్తుందంటు మాయమాటలు పలికాడు. నిజమని నమ్మిన చైతన్య తనకు స్కూటీ కావాలని చెప్పింది. అందుకు ష్యూరిటీగా బంగారం చూపాలని అప్పుడు గిఫ్ట్‌ ఇస్తామని చెప్పాడు. దీంతో తన వద్ద ఉన్న రెండు బంగారు ఉంగరాలు, చెవి కమ్మలు మొత్తం తులంన్నర బంగారం తెచ్చింది. బంగారం తూకం వేయాలని ఆమెను తన బైక్‌పై ఎక్కించుకుని స్టేషన్‌కు బయలుదేరాడు. ఇంతలో రైల్వే గేట్‌ పడటంతో బైక్‌ను వెనక్కు తిప్పి ఇస్లాంపురా కాలనీలో ఉన్న ఓ ఇంటి వద్ద ఆపి తాను బంగారాన్ని తూకం వేయిస్తానని చెప్పి ఇంట్లోకివెళ్లి కొద్ది సేపటికి బయటకు వచ్చాడు. ఇంట్లో బంగారం తూకం వేస్తున్నారని తాను వెళ్లి గిఫ్ట్‌ తీసుకువస్తానని వెళ్లిపోయాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో చైతన్య ఆ ఇంట్లోకి వెళ్లి అడుగగా తమకు ఎవరూ తెలియదని వారు సమాధానం ఇచ్చారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. సీసీ కెమెరాల్లో నమోదైన బైక్‌ నంబర్‌ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్‌)

ఎడపల్లి: భార్య మృతిని తట్టుకోలేక ఓ భర్త మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కుర్నాపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజు(30) ప్రైవేటు పనులు చేస్తుంటాడు. వివాహమై చాలా ఏళ్లు గడిచినా సంతానం కలుగక పోవడంతో రాజు భార్య మూడు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. దీంతో భార్య మృతితో మనస్తాపానికి గురైన రాజు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్‌

పేకాట స్థావరంపై దాడి

తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి దాడి చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 7040 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

నస్రుల్లాబాద్‌: మండలంలోని దుర్కిలో గంజాయి పండించి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లావణ్య సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సాయిలు తన పొలంలో గంజాయిని పండించి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి కేజీ 190 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ రూ. 29,750 ఉంటుందన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మొరం టిప్పర్ల పట్టివేత



సదాశివనగర్‌: మండలంలోని అడ్లూర్‌ ఎల్లారెడ్డి శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, టిప్పర్లను గ్రామస్తులు సోమవారం పట్టుకుని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టకుండా చూడాలని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పైడి జానకీజనార్దన్‌, ఎంపీటీసీ సంకరి లక్ష్మీరాజలింగం, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి బైండోవర్‌



కామారెడ్డి క్రైం: పట్టణంలోని పలు కాలనీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్‌ జనార్దన్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన ముప్పిల రాజేశ్వర్‌, కళ్లెం భగవాన్‌, రావుల రాజేశ్‌ అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు స్థానికుల ద్వారా గుర్తించినట్లు చెప్పారు. ఇలాగే ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఈతరాక విద్యార్థి మృతి



ఇందల్వాయి: చేపల కోసం సరదాకి చెరువులోకి దిగిన ఓ విద్యార్థి ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని మేఘ్యానాయక్‌ తండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నర్యాకి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన శ్రీనాథ్‌(16) ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్నాడు. సోమవారం మేకలను కాసేందుకు స్నేహితులతో కలిసి నల్లవెల్లి శివారులోని తిరుమలయ్య చెరువులోకి వెళ్లాడు. చేపల కోసం సరదాకి చెరువులోకి దిగిన శ్రీనాథ్‌ ఈత రాక నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై మహేశ్‌ రెస్క్యూ టీంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్‌ తెలిపారు.

ముబారక్‌నగర్‌లో చోరీ

- పది తులాల బంగారం, నగదు అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

నిజామాబాద్‌రూరల్‌: రూరల్‌ పీఎస్‌ పరిధిలోని ముబారక్‌నగర్‌లో దుండగులు రెండిళ్లల్లో ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కస్తూరి గార్డెన్‌ కాలనీలో నివాసం ఉండే ధనలక్ష్మి తన తల్లి ఇటీవల మృతి చెందడంతో కుటుంబంతో కలిసి కంఠేశ్వర్‌లో ఉంటోంది. దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 5 తులాల బంగారాన్ని దొంగిలించారు. ముబారక్‌నగర్‌ పరిధిలో ఉండే రాజగంగు ఇంట్లో సైతం దుండగులు చొరబడి 5 తులాల బంగారం, రూ.1.20 లక్షల నగదును అపహరించారు. ఒకే రోజు రెండిళ్లల్లో చోరీకి గురికావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

కామారెడ్డిలో ముగ్గురి అరెస్ట్‌



గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన యువకులు

కామారెడ్డి క్రైం: జిల్లాకు గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన నెనావత్‌ గణేశ్‌, వరియోగుల సాయి నాందేడ్‌కు వెళ్లి అక్కడ ఆరిఫ్‌ అనే మరో యువకుడితో కలిసి 300 గ్రాముల గంజాయిని తీసుకొని సోమవారం కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో దిగారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టణ పరిధిలోని యువత ఎవరైనా గంజాయి తాగడానికి అలవాటు పడితే గుర్తించాలని కోరారు. తమ దృష్టికి తీసుకొస్తే ప్రత్యేకంగా కౌన్సెలింగ్‌ నిర్వహించి గంజాయిని మాన్పించే విధంగా ప్రయత్నిస్తామన్నారు. తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

కోడి పందాలు ఆడుతున్న ముగ్గురు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న నర్సన్నపల్లిలో కోడి పందాలు ఆడుతున్న ముగ్గురిని దేవునిపల్లి పోలీసులు సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్‌, దేవునిపల్లి పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో కోడి పందాలు ఆడుతున్న ముగ్గురు స్థానికులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.56,160 నగదు, 3 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, 2 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఉద్రిక్తతకు దారితీసిన సరిహద్దు వివాదం



ఆందోళన నిర్వహిస్తున్న జాన్కంపేట్‌ గ్రామస్తులు

వేల్పూర్‌: చాలా ఏళ్లుగా జాన్కంపేట్‌, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదం సోమవారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. వాగులో తమ సరిహద్దు చూయించాలని జాన్కంపేట్‌ గ్రామస్తులు చాలా రోజులుగా అధికారులను కోరుతూ వస్తున్నారు. అధికారులు వాగులో సరిహద్దు చూయించడం లేదంటూ జాన్కంపేట్‌ గ్రామస్తులు తమవైపు నుంచి వాగులోకి రహదారి వేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న పచ్చలనడ్కుడ గ్రామస్తులు రహదారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరుగ్రామాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. భీమ్‌గల్‌ సీఐ శ్రీనివాస్‌, వేల్పూర్‌ ఎస్సై వినయ్‌కుమార్‌, ప్రత్యేక పోలీసు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని శాంతి భద్రతలు అదుపు తప్పకుండా మోహరించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇరు గ్రామాలవారితో చర్చించారు. అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదంటూ జాన్కంపేట్‌ గ్రామస్తులు, రోడ్డుకోసం వచ్చిన ట్రాక్టర్లను సీజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ నడ్కుడ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

గ్రామస్తులతో అధికారుల చర్చలు

వేల్పూర్‌ మండలం జాన్కంపేట్‌, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య వాగు సరిహద్దు సమస్యపై ఆర్మూర్‌ ఏసీపీ జగదీశ్‌ చందర్‌, తహసీల్దార్‌ నాగార్జున సోమవారం రాత్రి జాన్కంపేట్‌ గ్రామస్తులతో చర్చించారు. రోడ్డుకోసం ఉపయోగించిన జాన్కంపేట్‌ ట్రాక్టర్లను సీజ్‌ చేయడానికి పోలీసులు ప్రయత్నించడంతో జాన్కంపేట్‌ మహిళలంతా ఏకమై అడ్డుకున్నారు. ఏసీపీ, తహసీల్దార్‌ చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ట్రాక్టర్లను సీజ్‌ చేయకుండా జరిమానా విధించారు. దీంతో జాన్కంపేట్‌ మహిళలు శాంతించారు.

నల్లవెల్లిలో ఒకరి అదృశ్యం



ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లికి చెందిన కమ్మరి రవి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు. ఆర్మూర్‌కు చెందిన రవి అత్తగారి గ్రామమైన నల్లవెల్లిలో కొన్నేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైనట్లు స్థానికులు తెలిపారు. పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన రవి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్‌ పీఎస్‌ పరిధిలో ఉన్న మౌలాలి దర్గా సమీపంలో ఉన్న చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవీందర్‌ సోమవారం తెలిపారు. మృతి చెంది చాలా రోజులు కావడంతో మృతదేహం పూర్తిగా ఎముకలు తేలాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నిజామాబాద్‌రూరల్‌: గుండారం శివారులో ఉన్న కంకర క్రషర్‌లపై మైనింగ్‌ శాఖ ఏడీ సత్యనారాయణ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కంకర నిల్వల పరిణామం, కొలతల్లో అవకవతవలు జరిగితే క్వారీల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేనంబర్‌ 984లో ఉన్న క్వారీలను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. శ్రీ సంబాజీ మాతా కంకర క్వారీ నిల్వలను పరిశీలించారు. గనుల శాఖ నుంచి తీసుకున్న పర్మిట్‌ పరిణామాలు ప్రస్తుత నిల్వలకు పత్రాలు చూపాలని షోకాజ్‌ నోటీసు జారీ చేశారు. పూర్తిగా వివరణ ఇవ్వకుంటే క్వారీపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీజీ పరీక్షలకు 95 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ 3, 5, 7, 9వ సెమిస్టర్‌ పరీక్షల్లో సోమవారం 4వ రోజు 95 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ, ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 1,699 మందికి 1,605 మంది హాజరు కాగా 94 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన 181 మందికి 180 మంది హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌ నమోదు కాలేదన్నారు.